క్లుప్తంగా

భవిత కేంద్రంలో ఆటిజం దినోత్సవం



ర్యాలీ చేస్తున్న భవిత కేంద్రం విద్యార్థులు

పాకాల : స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని ఎంఈఓ బాబ్జి అధ్యక్షతన నిర్వహించారు. గురువారం భవితకేంద్రం విద్యార్థులు ఆటిజం దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఆటిజం సమస్య ఉన్న పిల్లలను చిన్న వయసులోనే గుర్తించి వారి నైపుణ్యాలకు తగిన విధంగా శిక్షణ అందిస్తే సాధారణ పిల్లల మాదిరిగానే తయారవుతారని తెలిపారు. వీరిపై జాలి చూపకూడదని, వారిలోని ప్రత్యేకమైన నైపుణ్యాలను గుర్తించి తర్ఫీదు ఇస్తూ వారిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో భవిత కేంద్రం సహిత ఉపాధ్యాయులు మునికృష్ణా రెడ్డి, సుందరి తదితరులు పాల్గొన్నారు.

నీటి యాజమాన్య పద్ధతిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన అధికారి శైలజ

పాకాల : మండలంలోని మామిడి రైతులకు నీటి యాజమాన్య పద్ధతిపై ఉద్యాన అధికారి శైలజ అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని చిన్నగోర్పాడు గ్రామంలోని మామిడి పంటపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారానికి ఒక్కరోజు 300 నుంచి 500 లీటర్ల నీటిని అందించడం వల్ల మామిడిలో అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి సత్కారం



హర్షిత్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు గ్రామపంచాయతీ దామినేడు సచివాలయ సెక్రటరీ హర్షిత్ గురువారం బదిలీ అయ్యారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు చంద్రనాయక్, సచివాలయ కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రత్నం స్కూల్ వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వల చేస్తున్న రత్నం స్కూల్ అధినేతలు

తిరుపతి కల్చరల్: డాక్టర్ కిషోర్స్ రత్నం స్కూల్ ఐదో వార్షికోత్సవం గురువారం మహతి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ స్కూల్ డైరెక్టర్స్ కృష్ణకిషోర్, వసంత కిషోర్ పాల్గొని విద్యార్థులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యతో పాటు విద్యార్థుల్లో సంప్రదాయం, సంస్కృతిని పెంపొందించాలనే ఉద్దేశంతో భారతీయ సంప్రదాయ శాస్త్రీయ నృత్యాల ప్రదర్శనలతో వార్షిక వేడుకలను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రత్నం స్కూల్స్ ప్రిన్సిపల్స్ పురుషోత్తం, రవి, వంశీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తిరుమలలో పాము హల్‌చల్



పామును చూపుతున్న భాస్కర్ నాయుడు

తిరుమల: తిరుమలలోని బీ టైపులో నాగుపాము హల్చల్ చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న స్నేక్ క్యాచర్ భాస్కర్ నాయుడు ఘటన స్థలానికి చేరుకుని పట్టుకుని సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదిలి పెట్టారు. అది సుమారు 6 అడుగుల నాగుపాముగా గుర్తించారు.

అందిస్తారా.. నాన్చుతారా..!

- మాస్టర్‌ప్లాన్ రోడ్లకు భూములిచ్చిన వారికి నేటికీ అందని టీడీఆర్ బాండ్లు
- ఇటీవల ఒక్కరికే బాండ్ ఇచ్చిన మున్సిపల్ యంత్రాంగం
- పెద్దఎత్తున విమర్శలు రావడంతో అప్రమత్తమైన నగరపాలక సంస్థ
- నేడు టీడీఆర్ బాండ్లపై స్పెషల్ డ్రైవ్

తిరుపతి తుడా: భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం తిరుపతి నగరంలో 21 మాస్టర్ ప్లాన్ రోడ్లకు శ్రీకారం చుట్టింది. కౌన్సిల్ ఆమోదంతో యుద్ధ ప్రాతిపాదికన రోడ్లను అభివృద్ధి చేశారు. ఇప్పటికే 17 రోడ్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధి, విస్తరణకు ప్రజలు ఆయా ప్రాంతాల్లో భూములను గిఫ్ట్ డీడ్‌గా మున్సిపల్ కార్పొరేషన్‌కు రాసిచ్చారు. ఈ క్రమంలో భూములు ఇచ్చిన రైతులు, యజమానులకు టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) బాండ్లను ఇవ్వాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో కొంతమందికి టీడీఆర్ బాండ్లు సకాలంలో అందించగా, ప్రస్తుత ప్రభుత్వం వాటిపై ఆంక్షలు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. తరువాత టీడీఆర్ బాండ్ల జారీపై రెండు కమిటీలను వేసింది. అయితే టీడీఆర్ బాండ్ల జారీలో కొందరు మామూళ్లకు కక్కుర్తిపడి ఆశించిన స్థాయిలో లబ్ధిదారులకు ఇవ్వకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో అధికార యంత్రంగా అప్రమత్తమైంది. స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు సిద్ధమైంది.



తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయం

వెల్లువెత్తిన విమర్శలు...

తిరుపతి నగరంలో టీడీఆర్ బాండ్ల వ్యవహారం వాడీవేడిగా మారింది. రోడ్ల అభివృద్ధి కోసం భూములు వదులుకున్న రైతులు, యజమానులకు నష్టపరిహారం కింద టీడీఆర్ బాండ్లను ఇవ్వాల్సి ఉంది. మొత్తం టీడీఆర్ బాండ్లు 1149 కాగా, గత ప్రభుత్వంలో 442 బాండ్లను బాధితులకు అందజేశారు. మరో 707 బాండ్లు ఇవ్వాల్సి ఉంది. వీటి కోసం ప్రభుత్వం ఓ కమిటీ వేసి అందులో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, డిప్యూటీ సిటీ ప్లానర్, డిప్యూటీ కమిషనర్, అనంతపురం రీజినల్ డైరెక్టర్లను సభ్యులుగా నియమించింది. టీడీఆర్ బాండ్ల జారీపై పూర్తిస్థాయిలో రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ అనంతరం అన్నీ సక్రమంగా ఉంటే యజమానులకు టీడీఆర్ బాండ్లను జారీ చేయాల్సి ఉంది. వందల మంది టీడీఆర్ బాండ్ల కోసం ఎదురు చూస్తుంటే సీఎం కార్యాలయ ఒత్తిడితో కేవలం ఒక్కరి కోసం ఆగమేఘాలపై జూమ్ మీటింగ్ నిర్వహించి రాత్రికి రాత్రి మంజూరు చేశారు. గంటల వ్యవధిలో టీడీఆర్ బాండ్లను జారీ చేసిన అధికారులు మిగిలిన వందల మందికి కూడా అదే తరహాలో ఇవ్వాలని విమర్శలు వెల్లువెత్తాయి.

నేడు స్పెషల్ డ్రైవ్

టీడీఆర్ బాండ్ల జారీ కోసం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని కమిషనర్ మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి కార్యాలయంలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొని టీడీఆర్ బాండ్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించడం, ఇతర సమస్యలు పరిష్కరించడం వంటివి చేస్తారని తెలిపారు. ముఖ్యంగా వ్యాలిడేషన్ చేయించుకునే వారు ఆధార్ కార్డు, పాన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని కోరారు. ఆన్‌లైన్ ఎండార్స్‌మెంట్ ఇచ్చిన వారు, షార్ట్ ఫాల్ ఇచ్చిన వారు రావాలని, టీడీఆర్ బాండ్లు పొందాల్సిన వారు స్పెషల్ డ్రైవ్‌కు తగిన డాక్యుమెంట్లతో హాజరు కావాలని కమిషనర్ తెలిపారు.

నోటీస్ బోర్డు

- శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు కపిలతీర్థంలో చక్రస్నానం
- జేఈఈ మెయిన్స్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు..
- యాదవ సంఘాల ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు టౌన్ క్లబ్ నుంచి కచ్చపి ఆడిటోరియం వరకు ర్యాలీ. అనంతరం 11 గంటలకు ఆడిటోరియంలో అభినందన సభ.
- మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంలో భాగంగా స్థలాలు కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్లను త్వరగా జారీ చేసేలా ప్రణాళిక రూపొందించేందుకు తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు స్పెషల్ డ్రైవ్
- సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ కార్మికులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు 12వ రోజు కొనసాగింపు
- లక్ష్మీపురం సర్కిల్లోని కెనడీ నగర్‌లో సాయంత్రం 5 గంటలకు మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా దీపం-2 ఎల్పీజీ లబ్ధిదారులకు సిలిండర్లు పంపిణీ
- ఇస్కాన్ రోడ్డులోని శ్రీరామకృష్ణ మిషన్ ఆశ్రమంలో సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ప్రవచన నిధి డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మచే శ్రీమద్రామాయణ ప్రవచనామృతం.

నిత్యం అప్రమత్తంగా ఉండండి



అలిపిరి టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్: నగరంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా అలిపిరి టోల్‌గేట్ వద్ద భక్తుల తనిఖీ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని.. వచ్చే భక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. అంతకుముందు ఆయన యూనివర్సిటీ పోలీస్ స్టేషన్, క్రైమ్ పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వెస్ట్ పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులను, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో రికవరీ రేటును పెంచాలని ఆదేశించారు. నగరంలో దొంగతనాలు జరగకుండా రాత్రివేళ పూట పూర్తిస్థాయిలో బీట్లు నిర్వహించాలన్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ.. రాంగ్ రూట్లో వెళ్లే వారికి జరిమానాలు విధించాలని సూచించారు.

జనసేన నేత కుటుంబానికి చెవిరెడ్డి పరామర్శ



చంద్రమౌళి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం ఓటేరుకు చెందిన జనసేన పార్టీ నేత బీగాల చంద్రమౌళి కుటుంబ సభ్యులను చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పరామర్శించారు. చంద్రమౌళి తండ్రి బీగాల వెంకటసుబ్బారావు గత నెల 22వ తేదీన మృతి చెందాడు. గురువారం దశదిన కర్మక్రియలు జరగడంతో ఆయన పాల్గొని ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. గత ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీలో ఉన్న బీగాల చంద్రమౌళి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జనసేనలోకి వెళ్లారు. అయినప్పటికీ ఆ కుటుంబం కష్టాల్లో ఉందంటే పరామర్శించి తన పెద్ద మనస్సును చాటుకున్నారు చెవిరెడ్డి.

వేడుకగా భారతీ తీర్థ స్వామి వజ్రోత్సవాలు



బాధ్యతలు స్వీకరిస్తున్న జీఎల్ మనోహర్

తిరుపతి కల్చరల్: భారతీ తీర్థస్వామి వారి 75వ జన్మదినం సందర్భంగా గురువారం శృంగేరి మఠంలో వజ్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర శారదాంబ ఆలయంలో విశేష పూజలు చేపట్టారు. అలాగే రాముల వారి ఆలయ ఉత్తర మాడవీధిలోని శంకరమఠంలో ఆది శంకరాచార్యుల వారికి అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. ప్రముఖ ప్రవచనకర్త కుప్ప విశ్వనాథ శాస్త్రి ఆధ్వర్యంలో వేద శాస్త్ర పండితుల సభలు జరిగింది. అనంతరం భారతీ తీర్థస్వామి వారి కృపతో జీఎల్ మనోహర్ తిరుపతి శంకరమఠం శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలను స్వీకరించారు. కార్యక్రమంలో ధర్మాధికారి రాళ్లపల్లి రామమూర్తి, శంకరమఠం మేనేజర్ నడింపల్లి కృష్ణ, పూర్ణచంద్ర, సురభి మురళి పాల్గొన్నారు.

పురిటి బిడ్డకు ప్రాణం పోస్తున్న తల్లిపాల నిధి



తల్లులను ఘనంగా సత్కరిస్తున్న అతిథులు, రోటరీక్లబ్ ప్రతినిధులు, వైద్యాధికారులు

తిరుపతి తుడా: ప్రసూతి ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన తల్లిపాల నిధి తల్లిపాలకు నోచుకోని ఎందరో పురిటి బిడ్డలకు ప్రాణం పోస్తోందని స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ కొనియాడారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రోటరీ మిల్క్ బ్యాంక్ ప్రథమ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పురిటి బిడ్డల ఆకలి తీర్చడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచే తల్లిపాలను అందించడానికి ముందుకు వచ్చిన తల్లులకు వందనం అన్నారు. ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీవీ చంద్రశేఖరన్ మాట్లాడుతూ ఈ సంవత్సర కాలంలో 247 లీటర్ల తల్లిపాలను సేకరించి 3475 మంది పిల్లలకు పంపిణీ చేయడం రోటరీక్లబ్ చేస్తున్న అత్యుత్తమ సేవ అని కొనియాడారు. తల్లిపాల నిధి చైర్మన్ టింకాయల దామోదరం, కోచైర్మన్ రోటరీక్లబ్ ప్రెసిడెంట్ సోము రవికుమార్ మాట్లాడుతూ తల్లులు తమ బిడ్డలకు ఇవ్వగా మిగిలిన పాలను తల్లిపాల నిధికి దానం చేసి తల్లిపాలకు నోచుకోని పిల్లలను ఆదుకోవలసిందిగా విజ్ఞప్తి చేశారు. అనంతరం ఏడాదిలో 22 నుంచి 34 లీటర్ల వరకు తల్లిపాల నిధికి అందించిన తల్లులను అతిథులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, ప్రముఖ వైద్యులు డాక్టర్ కిరీటి, డాక్టర్ పార్థసారథి, డాక్టర్ ఆర్ఆర్ రెడ్డి, డాక్టర్ రవి ప్రభు, డాక్టర్ ఉషా కళావతి తదితరులు పాల్గొన్నారు.

5, 11, 14 తేదీల్లో జయంతి ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: భరతజాతి గర్వించదగిన జాతీయ నేతలు, రాజనీతిజ్ఞులు, దళితుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుల జయంతి ఉత్సవాలను ఈనెల 5, 11, 14 తేదీల్లో మహతి కళాక్షేత్రంలో టీటీడీ ఘనంగా నిర్వహించనుంది. ఇందులో భాగంగా ఈనెల 5న డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్, 11న మహాత్మ జ్యోతిరావ్ పూలే, 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులు జాతీయ నేతల జీవిత విశేషాలు, వారు సమాజానికి చేసిన సేవలపై ప్రసంగిస్తారు.

బీజేపీ సీనియర్ నేత మృతి



గాలి ధనుంజయులు నాయుడు (ఫైల్)

తిరుపతి కల్చరల్: భారతీయ జనతా పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు గాలి ధనుంజయులు నాయుడు బుధవారం మృతి చెందారు. ఈయనకు భార్య గాలి రాజేశ్వరి, కుమారుడు గాలి భరత్‌కుమార్, కుమార్తె గాలి పుష్పలత, కోడలు, మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. పలువురి సందర్శనార్థం శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆయన భౌతిక కాయాన్ని బైరాగిపట్టెడలోని ఎంకే నాయుడు కాలనీలోని వారి స్వగృహంలో ఉంచనున్నారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు అంతిమ యాత్రతో కరకంబాడి రోడ్డులోని గోవిందధామంలో దహనక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బంగారు తిరుచ్చిపై శ్రీకృష్ణుడు



తిరుచ్చి వాహనంపై విహరిస్తున్న రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణుడు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారికి అనుబంధంగా వెలసిన శ్రీకృష్ణ స్వామివారు, అమ్మవార్లతో కలసి గురువారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రం రోహిణి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

తిరుచానూరులో..

తిరుపతి రూరల్ : తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయంలోని పరివార దేవతలుగా వున్న శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణుడు గురువారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శ్రీకృష్ణుని జన్మనక్షత్రమైన రోహిణీ నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి స్వామి, అమ్మవారిని తిరుచ్చిపై కొలువుదీర్చి నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు.

తిరుపతి - పళని ఆర్టీసీ బస్ సర్వీసు ప్రారంభం

సాక్షి, అమరావతి :తిరుపతి - పళని మధ్య ఆర్టీసీ బస్సు సర్వీసును ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గురువారం ప్రారంభించారు. ఏపీ, తమిళనాడు భక్తుల కోసం తిరుపతి నుంచి పళనికి, పళని నుంచి తిరుపతికి రోజూ రెండు బస్ సర్వీసులు నిర్వహించాలని ఆర్టీసీ నిర్ణయించింది. తిరుపతిలో రోజు రాత్రి 8గంటలకు బయలుదేరి ఉదయం 7 గంటలకు పళని చేరుకుంటుంది. అలానే మరో బస్సు సర్వీసు పళనిలో రాత్రి 8గంటలకు బయలుదేరి ఉదయం 7గంటలకు తిరుపతి చేరుకుంటుంది. పెద్దలకు రూ.680, పిల్లలకు రూ.380గా టికెట్ ధరను నిర్ణయించారు. ఆ బస్సు సర్వీసును పవన్ కల్యాణ్ మంగళగిరిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి ఎం. రామ్ ప్రసాద్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ పాల్గొన్నారు.

చైర్మన్ రాలేదు.. తిప్పలు తప్పలేదు..

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు అత్యంత వేడుకగాతో చేపట్టే స్వామివారి రథోత్సవం గురువారం రెండు గంటల పాటు ఆలస్యంగా ప్రారంభమైంది. ఏటా రథోత్సవం ఉదయం 7.15 గంటలకు ఆరంభమై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ 9.15 గంటలకు యథాస్థానానికి చేరుకోవడం ఆనవాయితీ. అయితే గురువారం తలపెట్టిన స్వామివారి రథోత్సవానికి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వస్తారన్న సమాచారంతో చాలా సమయం వరకు ఆలయ అధికారులు, అర్చకులు వేచి ఉండాల్సి వచ్చిందని సమాచారం. సమయం రెండు గంటల దాటినా చైర్మన్ రాకపోవడంతో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు స్వామివారి రథోత్సవం నిర్వహించారు. దీంతో స్వామివారి రథాన్ని తిలకించేందుకు విచ్చేసిన భక్తులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న యశోద ఆస్పత్రి డీజీఎం

తిరుపతి సిటీ: హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ యశోద ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో తిరుపతిలోని డాక్టర్ వీబీఆర్ విద్యాసంస్థలలో గురువారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు విశేష స్పందన లభించింది. బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం విద్యార్థులు పెద్దసంఖ్యలో మేళాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వేల్పుల విజయభాస్కర్ మాట్లాడుతూ విద్యాసంస్థలో విద్యార్థులకు విద్యతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. పేరొందిన ప్రముఖ యశోద ఆస్పత్రి డీజీఎం భూలక్ష్మి ప్రత్యక్షంగా ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థులకు ఆఫర్ లెటర్లు అందజేయడం సంతోషకరమన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు. మేళాలో వైస్ చైర్మన్ త్రిపుర దేవి, ప్రిన్సిపల్ ప్రియదర్శిని, వైస్ ప్రిన్సిపల్ అతుల్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే జరిమానాలు

తిరుపతి తుడా: నగరంలోని ఖాళీ స్థలాల్లో చెత్త వేసినా, శుభ్రంగా ఉంచుకోకపోయినా జరిమానాలు విధించాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం 14, 17 వార్డుల్లో పారిశుద్ధ్య పనులను హెల్త్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు చెత్తతో నిండి ఉన్నాయన్నారు. మురుగునీటి కాలువలు లేని ప్రాంతాల్లో కాలువల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇస్తే కలిగే లాభాలను పద్మావతి పార్కులో ప్రజలకు వివరించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసీపీ బాలాజి, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్‌వైజర్ ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చంద్రగిరి: అనుమానాస్పద స్థితిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఓ గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో నరసింగాపురం రైల్వే గేటు సమీపంలో మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ అనితతో పాటు సిబ్బంది మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 55 సంవత్సరాలు వయస్సు కలిగిన వ్యక్తి తల వెనుక రక్తపు గాయమైనట్లు గుర్తించారు. చందనం రంగు ఫుల్ హ్యాండ్ షర్టు, తెలుపు రంగు గల్ల లుంగీ, తెలుపు, మెరున్ రంగు టవల్ ఉన్నట్లు తెలిపారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు.

7న మహాధర్నా

తిరుపతి రూరల్: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై గత 11 రోజులుగా తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద కార్మికులు ఎండలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే పరిస్థితి కనబడడం లేదని సీఐటీయూ తిరుపతి జిల్లా కార్యదర్శి జయచంద్ర తెలిపారు. కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు మద్దతు తెలుపుతూ ఈనెల 7వ తేదీన మహాధర్నా చేపడుతున్నట్టు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తిరుపతి రూరల్: పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై వకుళమాత ఆలయం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... చంద్రగిరి వైపు నుంచి తిరుపతికి వస్తున్న కారు (ఏపీ 39 జీపీ 9415) వకుళమాత ఆలయం నుంచి తిరుపతి వైపునకు వస్తూ జాతీయ రహదారి దాటుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో కారుతో పాటు ద్విచక్రవాహనం దెబ్బతినగా ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న మోహన్, ధనుష్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి సేవలో పూజాహెగ్డే



ఆలయం వెలుపల పూజాహెగ్డే

తిరుపతి రూరల్ : తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారిని సినీనటి పూజాహెగ్డే దర్శించుకున్నారు. గురువారం అమ్మవారి ఆలయానికి వచ్చిన ఆమెకు అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేయించారు. అనంతరం ఆలయంలోని ముఖమండపంలో వేద ఆశీర్వచనం, అమ్మవారి తీర్థ ప్రసాదాలు, పసుపు, కుంకుమ అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ రమేష్ నాయుడు, విజిలెన్స్ అధికారులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

ఉచిత పాలీసెట్ మోడల్ పరీక్ష రేపు

తిరుపతి సిటీ: స్థానిక భవాని నగర్ వద్దగల గగన కోచింగ్ సెంటర్‌లో శనివారం విద్యార్థులకు పాలీసెట్‌పై అవగాహన కల్పించేందుకు ఉచితంగా మోడల్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ కరుణామూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాయనున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9014052757, 9553590099 నంబర్లలో సంప్రదించాలని కోరారు.